Congratulations!

## నాయకత్వ గిరి శిఖరాలు

ప్రియ తరగతి, పాఠశాల, మండల,డివిజన్ విద్యా శ్రామికులకు,

ప్రతి వ్యక్తి జీవితంలో కొన్ని మధుర క్షణాలు ఉంటాయంట...
బహుశా 7.12.2024 యువ సభ్యులకు ఒక మార్గదర్శక కృత్యంగా, మధ్య వయసు మరియు విశ్రాంత జీవితానికి దగ్గరవుతున్న సీనియర్లకు తమ వారసులతో పంచుకునే తీయని జ్ఞాపకంగా మిగిలిపోతుందనటంలో సందేహం లేదు.

1,55,081 మంది తల్లిదండ్రుల చిరునవ్వులతో, 18,236 మంది పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యుల బాధ్యతాయుత హాజరీతో, 2168 మంది మంచి పౌరులుగా ఎదిగిన పూర్వ విద్యార్థులతో, 1712 మంది పుణ్యశీలురైన దాతలతో, ఇంకనూ 40,342 మంది ఉత్సాహంతో కూడిన పాఠశాల ప్రేమికులతో నిండిపోయిన జిల్లాలోని 2638 పాఠశాలల్లోని కమనీయ దృశ్యాలు.. కన్నుల పండుగలు..సంతోషాతిరేకాల ఆత్మీయ కలయిక సుమధుర శుభదినం కాదా మరి!!!

ఆరోజు ఎలమంచిలి, శ్రీముఖలింగం పాఠశాలల్లోని ప్రత్యక్ష అనుభూతులు.. కోటబొమ్మాలిలో గౌరవ మంత్రివర్యులు, జిల్లా కలెక్టర్ వారి ప్రశంసల పరోక్ష ఆనందానుభూతి.. ప్రతి దగ్గర గౌరవ శాసన సభ్యుల, ప్రజా ప్రతినిధుల అభినందనలు, మరుసటిదినం ఎన్ఎంఎంఎస్ పరీక్షలకు వెళ్ళినప్పుడు టెక్కలి, కాశీబుగ్గ పాఠశాలలోని అద్భుత అలంకరణలు.. ఎక్కడ చూసినా ఒక అంబానీ వారింట పెళ్లి సందడికి తీసిపోని ఉత్సాహం, జాయింట్ కలెక్టర్ వారి ప్రశంసలు పొందిన కాశీబుగ్గ ప్రధానోపాధ్యాయుని కంటి వెలుగుల్లో సిక్కోలు 'ఉపాధ్యాయ ఆత్మస్థైర్యం' కనబడింది.





ఈ ప్రశంసలు ఏ ఒక్కరివో కాదు మిత్రులారా, సిక్కోలు విద్యా బృందానివంతటివీ..ఈ క్రతువులో మండల వనరుల సిబ్బంది, సిఆర్ఎంటి మిత్రులు చేసిన కృషి అనితర సాధ్యం.. పండుగ ముగిసిన తరువాత అదే సాయంత్రం కూర్చుని డాక్యుమెంట్స్ పంపడానికి వీరు, సమగ్ర శిక్ష విద్యాశాఖ మిత్రులు చేసిన కృషి సిక్కోలును ప్రథమ స్థానంలో నిలిపింది.



మన ఇంటి పండుగకు వేలాదిగా కదిలిన జిల్లా అధికార,అనధికార యంత్రాంగపు అతిథులకు కృతజ్ఞతలు తెలపడం ప్రథమ బాధ్యత కాబట్టి సోమవారమే చెప్పగలిగినా, ఇంకా నా కుటుంబానికి అక్షర లక్షలు ఇవ్వలేక పోతున్నానని మూడు దినాలుగా మనసు దిగులుగానే ఉంది. ఆదివారం కంచిలిలో ఒడియా మిత్రుల అద్భుత మేధోసమ్మేళనానికి హాజరు కావడం, సోమవారం 'మీకోసం', కళా ఉత్సవం బాధ్యతలు.. వెరసి కాస్త విరామం..





ఏ ఒక్కరిని కదిలించినా, ఏ అధికారివారిని కలిసినా 'మీ బృందం దంచేసిందండి' అంటుంటే ఆనందభాష్పాలు.. 'మరేం అనుకున్నారు.. మేం సమాజ పథనిర్దేశికులం' అనుకున్నా. ఇంట్లో పెళ్లికి ఐదు లక్షల బడ్జెట్ అనుకుంటే, పది లక్షలకైనా తగ్గేదేలే అన్నట్లు, ఒక పది రూక లెక్కువే ఖర్చు చేశారు గానీ ఎవరూ తగ్గలేదు. గది గదికి పోటీయా అన్నట్టు గా కాశీబుగ్గ పాఠశాలలోని అన్ని గదుల అలంకరణ చూస్తుంటే ఇది పాఠశాలా, దేవాలయాల ప్రాంగణమా!! అని మనసు మాటలేని మూగదైంది.. వారం రోజుల శ్రమ ఉఫ్ మని ఎగిరిపోయింది. ఒక ఓవర్లో ఆరు సిక్సర్లు కొట్టిన క్రికెట్ వీరుడి ఆనందం..

సోమవారం జరిగిన వెబ్ సమావేశంలో కమిషనర్ వారి అభినందనలు వింటుంటే, స్వర్ణాంధ్రప్రదేశ్, 'విద్యకు ఒక చిరునామాగా' మారబోతోందనిపించింది.

ఎన్నని చెప్పాలి.. ఏమని చెప్పాలి.. ఏమివ్వగలం ఈ కృషికి?
ఒక ప్రేమ పూర్వక అభినందన తప్ప..🦚



మీ
తిరుమల చైతన్య,
జిల్లా విద్యాశాఖాధికారి శ్రీకాకుళం.